క్లుప్తంగా

ఆత్మరక్షణపై శిక్షణ



విద్యార్థులకు ఆత్మరక్షణపై శిక్షణ ఇస్తున్న శిక్షకుడు శ్రీనివాస్

గంట్యాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆత్మరక్షణపై తైక్వాండో మాస్టర్ శ్రీనివాస్ సోమవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఎస్సై సాయికృష్ణ, ఎంఈఓ విజయకుమారి, హైస్కూల్ హెచ్ఎం ఝాన్సీ, ట్రైనీ ఎస్సై పి. నాని, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేవరకూ పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

గుర్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేవరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీపీఐ రాష్ట్ర మహాసభలు ఈ నెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నాయకులు గతంలో స్మార్ట్‌మీటర్లు వద్దని చెప్పి.. ఇప్పుడు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర సభలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చిస్తామన్నారు.

షాపు ఒకరిది.. నిర్వహణ మరొకరిది..



పురిటిపెంట డిపోను నిర్వహిస్తున్న అనధికార వ్యక్తులు

గజపతినగరం రూరల్: మండలంలోని పురిటిపెంట గ్రామంలో రేషన్ దుకాణం అంపోలు అనూష పేరున ఉండగా.. నిర్వహణ మాత్రం వేరే వ్యక్తి చేస్తున్నాడు. ఎవరి పేరున డీలర్‌షిప్ ఉందో వారే సరుకులు ఇవ్వాల్సి ఉండగా.. ఇతరులు ఇవ్వడంతో ఇబ్బందికర వాతావరణం నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయమై అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభినందనలు




క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చీపురుపల్లి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణాజీ, తదితరులు సోమవారం అభినందించారు. రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్, హైజంప్ పోటీలకు టి.దేవిక. కె.స్వాతి అనే ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 9,10,11 తేదీల్లో చీరాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. జ్వాలాముఖి, పీడీ వి.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘం ఖాతాలో నగదు మాయం..

- వెంటనే స్పందించి నగదు రికవరీ చేసిన బ్యాంక్ సిబ్బంది



Rs.80000.00 Debited to SB-xxx7639 AcBal:72814.38 CLRBal: 72814.38 [SELF] GUJJANGIVALASA on 02-08-2025 12:59:47.IOB. Feedback: https://voice.iob.in/iobfb/?a=D7Z2020825125947
14:39

రూ. 80 వేలు విత్ డ్రా అయినట్లు వచ్చిన సందేశం

గుర్ల: మండలంలోని తాటిపూడికి చెందిన డ్వాక్రా సంఘం పొదుపు ఖాతాలో రూ. 80 వేలు నగదు సభ్యుల ప్రమేయం లేకుండా విత్‌డ్రా కావడంతో గ్రూపు సభ్యులు (రాజులమ్మ డ్వాక్రా సంఘం) సోమవారం ఆందోళన చెందారు. డ్వాక్రా సంఘ అధ్యక్షురాలికి డబ్బులు విత్‌డ్రా అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో విషయం బయటకు వచ్చింది. వెంటనే సంఘ సభ్యులు మండలంలోని గుజ్జంగివలస ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ అధికారులను సంప్రదించగా.. వేరొక ఖాతా నుంచి నగదు విత్ డ్రా చేయిబోయి మీ ఖాతాలో నగదు తీసివేయడం జరిగిందని బదులిచ్చారు. అనంతరం విత్‌డ్రా అయిన రూ. 80 వేలను తిరిగి జమ చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రసవాలు చేస్తున్నట్లు వైద్యాధికారి వెంకటరమణ తెలిపారు. గోభ్యాం గ్రామానికి చెందిన వైకుంఠపు దమయంతి పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరగా సోమవారం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గత నెలలో కూడా ఇద్దరు గర్భిణులకు ప్రసవాలు జరిపించామన్నారు. గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం

- సీడీపీఓ ఉమాదేవి



కొత్తవలస: గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తవలస: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఆర్.ఉమాదేవి అన్నారు. మండలంలోని వియ్యంపేటలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మంది గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండడం వల్ల బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలని సూచించారు. ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలే ఆహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సహాయ సీడీపీఓ లక్ష్మీబాయి, సర్పంచ్ పులిబంటి జ్యోతి, అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



బొండపల్లి: దేవుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు

తల్లిపాలతో ఆరోగ్యం..

బొండపల్లి: తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ ఉమాభారతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని దేవుపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గంట్యాడ: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

శిశువు ఆరోగ్యానికి పునాది..

గంట్యాడ: తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి పునాది అని నేచర్ సంస్థ, ఎస్‌బీఐ ఫౌండేషన్ డాక్టర్ ఎంఎంయు అఖిల్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పెనసాంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పైడిరాజు, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గరివిడి మండల విలేకరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, వెంటనే ఆ హామీ నిలబెట్టుకోవాలని గరివిడి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ బంగ్రాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అక్రిడేషన్లు ఇవ్వడంతో పాటు హెల్త్‌స్కీమ్‌ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రిక్షా కాలనీలో ప్రబలిన జ్వరాలు



మంచం పట్టిన చిన్నారి

చీపురుపల్లి: మేజర్ పంచాయతీ పరిధిలోని రిక్షా కాలనీలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంటిలోనూ జ్వరపీడితుడు ఉన్నడంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 20 రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నట్లు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 70 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు సమాచారం.

బాబు పాలనంతా మోసమే..



బోడసింగిపేటలో బాబు మోసాలు వివరిస్తున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనంతా మోసమేనని ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు ఆరోపించారు. మండలంలోని గొట్లాం, బోడసింగిపేట గ్రామాల్లో సోమవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి రమణ, బోడసింగి జగదీష్, పల్లి రఘు, మండల రామునాయుడు, ఎం.రామప్పడు, గొల్లు సతీష్, తాళ్లపూడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి మార్కులు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం బీపీపీ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): మైన్స్ లీజులను పునరుద్ధరించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. గరివిడి మండలంలోని దేవాడ మైన్స్, గుర్ల మండలంలోని సదానందపురం మైన్స్ లీజులను పునరుద్ధరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ బంగారాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు టీవీ రమణ, జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు ఎ.గౌరినాయుడు మాట్లాడుతూ.. మైన్స్ గడువు ముగిసిపోవడంతో కార్మికులకు పని లేకుండా పోయిందన్నారు. కార్మికుల జీవితాలు రోడ్డున పడకుండా లీజులను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జె.విశ్వనాథరాజు, అప్పలనాయుడు, సన్యాసినాయుడు, పాపినాయుడు, సాంబ, తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

కొత్తవలస: ఆగస్టు 15 నేపథ్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను హెచ్ఎం సీహెచ్ ఈశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య సోదరభావం, పోటీతత్వం పెంపొందించేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీలు పాప, కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ



చిన్నారి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు పరామర్శించారు. సోమవారం విశ్వనాథపురం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రేవల్ల సత్తిబాబు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ ఎల్.ప్రభాత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బానాదిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

వేపాడ: మండలంలోని బానాదిలో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సత్యసాయిబాబా మందిరం వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం నిర్వహిస్తామని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షేత్ర సహాయకులకు శిక్షణ



ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రవికుమార్

వేపాడ: జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులకు సోమవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ రవికుమార్ మాట్లాడుతూ.. వేతనదారులకు సకాలంలో వేతనాలు అందాలంటే పని ప్రదేశంలోనే ఈకేవైసీ చేయించాలన్నారు. విధిగా ఆధార్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. వేతనదారులు సకాలంలో పనికి హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఆదిలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శృంగవరపుకోట: మండలంలోని తాటిపూడి గురుకుల జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్ పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారదాబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీలో పోస్టు గ్యాడ్యుయేషన్ పూర్తి చేసి 50 శాతం మార్కులు సాధించిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల ఏడో తేదీలోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. పూర్తి వివరాలకు 87126 25071 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొత్తవలసను కరువు ప్రాంతంగా ప్రకటించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేగల అప్పలరాజు

కొత్తవలస: లోటు వర్షపాతం కారణంగా మండలంలోని ఎక్కడా ఉభాలు ప్రారంభం కాలేదని.. అధికారులు స్పందించి కొత్తవలసను కరువు మండలంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి దేగల అప్పలరాజు కోరారు. ఈమేరకు తహసీల్దార్ అప్పలరాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పశువులకు కనీసం మేత కూడా దొరికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

వేపాడ: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని మండలానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు ఉప తహసీల్దార్ రామకృష్ణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

టీ షర్టులు పంపిణీ



విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పలువురు విద్యార్థులకు టీ షర్టులు, నిరుపేదలకు నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు టీ షర్టులు చొప్పున సర్పంచ్ కిలారి సూర్యారావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ గౌరవాధ్యక్షుడు కొవ్వాడ చంద్రశేఖర్, మిడతాన తాతంనాయుడు, కిలారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర శివారు గ్రామంలో కాయిన్‌గేమ్ ఆడుతున్న ఇద్దరిని సోమవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. జూదం జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్.కోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా ఇద్దరు పట్టుబడ్డారు. రూ. 13,150 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఫోన్లు మాకొద్దు మహాప్రభో..



ఎస్.కోట: సెల్‌ఫోన్లు మాకొద్దంటూ నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది నిరసన
- సీడీపీఓకు మొబైల్ ఫోన్ల అప్పగింత

చీపురుపల్లి: పని చేయని ఫోన్లతో పని ఒత్తిడి పెంచడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి టీవీ రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలకు 2జీ ఫోన్లు ఇచ్చి 5జీ యాప్‌లు అప్‌లోడ్ చేయమనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఫోన్లు పనిచేయకపోతే సిబ్బందిని బాధ్యులు చేయడం సరికాదన్నారు. అనంతరం సిబ్బంది తమ ఫోన్లను సీడీపీఓకు అప్పగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ ప్రతినిధులు నాగమణి, మాలతి, తదితరులు పాల్గొన్నారు.

నిరసన

శృంగవరపుకోట: సీఐటీయూ నేతృత్వంలో ఎస్.కోట ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సెల్‌ఫోన్లను సామూహికంగా సీడీపీఓ అచ్యుతకు అందజేశారు. ఫోన్లు పనిచేయక, సిగ్నల్స్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో లబ్ధిదారులకు సరుకులు ఇచ్చిన ప్రతిసారీ అప్‌లోడ్ చేయమనం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పాత పద్ధతుల ప్రకారమే రికార్డులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు సీహెచ్.ముత్యాలు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, డి.సుశీల, వి.మాణిక్యం, ఆర్‌వీ లక్ష్మి, కె.రాధ, ఏఎస్ఆర్ లక్ష్మి, జి.సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వర్క్‌లు చేయలేం..

గజపతినగరం: ఆన్‌లైన్ వర్క్‌లు చేయలేమని.. చిన్నారులు, లబ్ధిదారుల హాజరు, పౌష్టికాహారం పంపిణీ వంటి వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. కార్యకర్తలందరూ సీడీపీఓ ఎం. రాజేశ్వరికి సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సుభాషిని, జ్యోతి మాట్లాడుతూ.. సిగ్నల్స్ అందక సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని.. ప్రతి పనినీ సెల్‌ఫోన్‌లో అప్‌లోడ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. అలాగే ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.అనసూయ, జిల్లా గౌరవాధ్యక్షురాలు వి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మొబైల్ ఫోన్లతో నిరసన తెలియజేస్తున్న సిబ్బంది



గజపతినగరం: సీడీపీఓ రాజేశ్వరికి సెల్‌ఫోన్లు అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వినూత్న నిరసన..



బుద్ధి లేక జిందాల్‌కు భూములు ఇచ్చాం.. జిందాల్ పెద్దలకు మంచి బుద్ధి ప్రసాదించు దేవుడా అంటూ జిందాల్ నిర్వాసితుల తమ చెప్పలతో తామే కొట్టుకుంటూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. బొడ్డవరలో చేపట్టిన ఈ నిరసనకు పలువురు సంఘీభావం తెలిపారు.

\- శృంగవరపుకోట